క్లుప్తంగా

13న డిగ్రీ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

టెక్కలి: టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ టి.గోవిందమ్మ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. బీఎస్సీ, బీకాం, బీఏ తదితర కోర్సుల్లో ఈ నెల 13వ తేదీన స్పాట్ అడ్మిషన్లు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు విద్యార్హత సర్టిఫికెట్లతో హాజరు కావాలని సూచించారు.

పాస్టర్ ఫెలోషిప్ నూతన కార్యవర్గం ఎన్నిక



నూతన కార్యవర్గ సభ్యులు

టెక్కలి: టెక్కలి నియోజకవర్గం పాస్టర్స్ ఫెలోషిప్ నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. స్థానిక లివింగ్ స్టోన్ చర్చి ఆవరణలో జిల్లా పాస్టర్స్ ఫెలోషిప్ చైర్మన్ డి.ఎ స్.వి.ఎస్.కుమార్ ఆధ్వర్యంలో కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా మంగళవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వై.ఎస్.ఏలియా, ఉపాధ్యక్షుడుగా రత్నరాజు, కార్యదర్శిగా డేవిడ్ మోహన్, సంయుక్త కార్యదర్శిగా రాబర్ట్ పాల్, కోశాధికారిగా సుధాకర్, సంయుక్త కోశాధికారిగా కాలేబు, ముఖ్య సలహాదారుడిగా కణితి అబ్రహం ఎన్నికయ్యారు.

బదిలీపై వెళ్లిన ఎస్సైకు సన్మానం



రవికుమార్‌ను సన్మానిస్తున్న నాయకులు

మందస: మందస ఎస్సైగా పని చేసి బదిలీపై వెళ్తున్న ఎనుకోటి రవికుమార్‌ను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మంగళవారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన సేవలను కొనియాడారు. క్రైం రేటు తగ్గించడం, రహదారి ప్రమాదాలపై అవగాహన కల్పించడం చేశారని, సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగస్వామ్యులయ్యారని అభినందించారు. వెంకటేశ్వరుని చిత్రపటాన్ని అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి దల్లి జానకీరావురెడ్డి, మాజీ సర్పంచ్ మద్దిల రామారావు, గిరిజన నాయకుడు సవర నీలకంఠం, పార్టీ నాయకులు తలగాన హరికృష్ణ, మల్ల నిరాకర్ ఉన్నారు.

మానసిక దివ్యాంగులపై ప్రేమగా మెలగాలి



మాట్లాడుతున్న జడ్జి తేజ చక్రవర్తి మల్ల

టెక్కలి: మానసిక దివ్యాంగుల పట్ల ప్రేమగా మెలిగి వారిని ఆదరించాలని టెక్కలి జూనియర్ సివిల్ జడ్జి ఎస్.హెచ్.ఆర్.తేజ చక్రవర్తి మల్ల కోరారు. ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా మంగళవారం టెక్కలి భవిత కేంద్రం వద్ద న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. మానసిక దివ్యాంగుల పట్ల కుటుంబ సభ్యులతో పాటు సమాజం సైతం అభిమానం చూపాలన్నారు. వారికి ఉన్న హక్కులను వివరించారు. అనంతరం పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు డి.వివేకానందా, విద్యా శాఖాధికారులు డి.తులసీరెడ్డి, డి.చిన్నారావు, ఎస్సై ఎల్.రామకృష్ణ, రిసోర్స్‌పర్సన్ ఎ.మన్మథరావు పాల్గొన్నారు.

నేడు సంతబొమ్మాళిలో 'జగనన్నకు చెబుదాం'

సంతబొమ్మాళి: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం ఉదయం పది గంటలకు జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ చలమయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలవాసులు తమ సమస్యల పరిష్కారం కోసం దీన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

వలంటీర్ల పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు

ఇచ్ఛాపురం రూరల్: మండలంలోని మండపల్లి, కేదారిపురం, తులసిగాం, తేలుకుంచి, ఈదుపురం గ్రామ సచివాలయాల పరిధిలో ఖాళీగా ఉన్న ఎనిమిది వలంటీర్ల పోస్టుల భర్తీ కోసం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. అభ్యర్థులను ఈవోపీఆర్డీ కె.వి.ఎ.సత్యనారాయణ, ఎంఈఓ కురమాన అప్పారావు ఇంటర్వ్యూ చేశారు. ఎంపికైన వారికి త్వరలో నియమాక పత్రాలు అందజేస్తామన్నారు.

పాఠశాలకు సౌండ్ సిస్టం వితరణ

కంచిలి: దోలగోవిందపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఒడియా మీడియం భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడుగా దువ్వాడ జగదీష్ చంద్ర చౌదరి ఎనిమిదేళ్ల పని చేసి కొద్ది నెలల క్రితం మృతి చెందారు. అతని జ్ఞాపకార్థం తండ్రి జయరాం చౌదరి, సోదరుడు ఛత్రపతి చౌదరిలు పాఠశాలకు రూ. 20 వేల విలువైన సౌండ్ సిస్టమ్‌ను వితరణ చేశారు. దీన్ని ప్రధానోపాధ్యాయుడు ఉప్పాడ రమేష్‌కు మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మదన్‌నాయక్ పురందర సబరో, జి.భారతి పాల్గొన్నారు.

ఆరోగ్యానికి రక్ష..జగనన్న సురక్ష

ప్రజల ఆరోగ్యానికి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం శ్రీరామ రక్షగా నిలుస్తోందని వక్తలు అన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. టెక్కలి, ఇచ్ఛాపురం, పలాస నియోజకవర్గాల్లోని పలు గ్రామాల్లో వైద్య శిబిరాలను అధికారులు మంగళవారం నిర్వహించారు. శిబిరాలను వచ్చిన వారికి వివిధ ఆరోగ్య పరీక్షలను వైద్యులు చేసి మందులను అందజేశారు. పౌష్టికాహార ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.



మందస: భోగాపురంలో రోగులకు మందులు అందజేస్తున్న సర్పంచ్ సారి రంజితచౌదరి



టెక్కలి: అయోధ్యపురంలో పౌష్టికాహార ప్రదర్శనను తిలకిస్తున్న కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ కిల్లి కృపారాణి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బగాది హరి



ఇచ్ఛాపురం రూరల్: బిర్లంగిలో రోగులను పరీక్షిస్తున్న వైద్యులు రేవతి భేరి, వై.కల్యాణి



వజ్రపుకొత్తూరు: కంబాలరాయుడుపేటలో పోషకాహార స్టాల్‌ను పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పాలిన శ్రీనివారావు



కోటబొమ్మాళి: అక్కయ్యవలసలో వైద్య సేవలపై ఆరా తీస్తున్న డీఎంహెచ్‌వో బొడ్డేపల్లి మీనాక్షి



కంచిలి: కుంబరినౌగాంలో వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు ఇప్పిలి లోలాక్షి



నందిగాం: హర్షబడలో ఓపీ రిజిస్ట్రేషన్ చేస్తున్న వైద్య సిబ్బంది



సంతబొమ్మాళి: నర్సపురంలో మందులు పంపిణీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు సంపతిరావు రాఘవరావు



సోంపేట సచివాలయం-3 పరిధిలో వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎంపీపీ నిమ్మన దాస్

సీఎం జగన్ పాలనలోనే నాయీబ్రాహ్మణులకు గుర్తింపు

టెక్కలి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలోనే నాయీబ్రాహ్మణులకు ప్రత్యేక గుర్తింపు దక్కిందని రాష్ట్ర నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ ముంగండి రమణమ్మ అన్నారు. వారి అభ్యున్నతికి చారిత్రాత్మకమైన సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. ప్రభుత్వం కొత్తగా మంజూరు చేసిన నాయీబ్రాహ్మణ వాయిద్య కళాకారుల గుర్తింపు కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం టెక్కలిలో నిర్వహించారు. టెక్కలి, పలాస డివిజన్ పరిధిలో మంజూరైన సుమారు 200 గుర్తింపు కార్డులను ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో చేదోడు పథకం ద్వారా రూ. పది వేలు, సెలూన్ దుకాణాలకు 150 యూనిట్ల ఉచిత విద్యుత్, దేవస్థానాల పాలక మండలిలో ప్రాధాన్యత, కల్యాణ కట్టల్లో పనిచేస్తున్న వారికి కనీస వేతనాలు, నాయీబ్రాహ్మణులను ఎవరైనా కించపరిచే విధంగా మాట్లాడితే వారిపై చర్యలు తీసుకునే విధంగా జీవో నంబర్-50ను అమలు చేశారన్నారు. వీటితో పాటు వాయిద్య కళాకారులకు గుర్తింపు కార్డులు అందజేస్తున్నారని చెప్పారు. శ్రీకాకుళం జిల్లాలోనే వెయ్యి మందికిపైగా గుర్తింపు కార్డులు వచ్చే విధంగా కార్పొరేషన్ చైర్మన్ సిద్దవటం యానాదయ్య కృషి చేశారన్నారు. నాయీబ్రాహ్మణులకు ప్రత్యేక గుర్తింపు తీసుకువచ్చిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరో సారి ముఖ్యమంత్రి చేసి రుణం తీర్చుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు రౌతు శంకరరావు, వాయిద్య కళాకారుల సంఘం అధ్యక్షుడు శంకరరావు, నాయకులు ముంగండి సూర్యనారాయణ, రమణమూర్తి, కొండలరావు, కృష్ణప్రసాద్, టి.కర్రెన్న, ఎల్.పాపారావు, నీలాద్రి, కె.రామారావు, ఎస్.వెంకట్రావు, ఐ.చిన్నారావు, ఎల్.రామారావు, వీరాస్వామి పాల్గొన్నారు.



వాయిద్య కళాకారులకు గుర్తింపు కార్డులు అందజేస్తున్న రమణమ్మ తదితరులు

సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న దేవదాస్‌రెడ్డి

కంచిలి: మండలంలోని ఎస్.ఆర్.సి.పురం పంచాయతీలో 15వ ఆర్థిక సంఘం నిధులు రూ. 4 లక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి మంగళవారం భూమిపూజ చేశారు. సర్పంచ్ డొక్కరి తులసీ బలరాం అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు వజ్జ మృత్యుంజయరావు, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు దుర్గాసి ధర్మారావు, జేసీఎస్ మండల కన్వీనర్ కొణపల సురేష్ ఉన్నారు.

చేప పిల్లలు పంపిణీ

నందిగాం: మండలంలోని గిరిజన గ్రామాల్లోని చెరువుల్లో చేపల పెంపకం కోసం మత్స్యశాఖ సిబ్బంది చర్యలు తీసుకున్నారు. ఇందులో భాగంగా బెల్లుకోల, బైరిబొడ్డపాడు, జయపురం, సవరనీలాపురం, కందులగూడెం, భర్తుపురం గ్రామాల్లోని చెరువుల్లో లక్షా ఎనభై వేల చేప పిల్లలను మంగళవారం ఆయా గ్రామస్తులకు పంపిణీ చేశారు. అనంతరం చెరువుల్లో విడిచిపెట్టారు.

ఇంటర్ సర్టిఫికెట్లు తీసుకోవాలి

సంతబొమ్మాళి: నౌపడ ప్రభుత్వ జూనియర్ కాలేజీలో చదివి ఈ ఏడాది మార్చి, మే నెలలో జరిగిన పరీక్షలో ఉత్తీర్ణత పొందిన ఇంటర్ విద్యార్థులు తమ ఒరిజినల్ మార్క్ మెమోలను తీసుకోవాలని ప్రిన్సిపాల్ ఎం.నారాయణరావు కోరారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కాలేజీ పని దినాల్లో విద్యార్థులు వచ్చి సర్టిఫికెట్లను తీసుకోవాలని సూచించారు.

నేడు హరిపురంలో ఉచిత వైద్య శిబిరం

మందస: హరిపురం గ్రామంలో బుధవారం మెగా ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్టు నిర్వాహకులు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. కిడ్నీ, చెవి, గొంతు, ముక్కు వ్యాధులకు సంబంధించి నెఫ్రాలజిస్ట్ డాక్టర్ యర్ర రాకేష్, ఈఎన్‌టీ డాక్టర్ సురేంద్రకుమార్, జనరల్ మెడిసిన్ డాక్టర్ డి.నరేష్‌లు వైద్య పరీక్షలు చేస్తారని.. స్థానికులు శిబిరాన్ని వినియోగించుకోవాలని కోరారు.

నేత్ర వైద్య శిబిరం విజయవంతం

కాశీబుగ్గ: పలాస సత్యసాయి ఆలయం వద్ద జిల్లా అంధత్వ నివారణ సంస్థ శ్రీకాకుళం వారి ఆధ్వర్యంలో విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్ సంయుక్తంగా పలాస సత్యసాయి సేవా సమితి సౌజన్యంతో మంగళవారం కంటి వైద్య శిబిరం నిర్వహించారు. కంటి వైద్య నిపుణులు జాక్సన్ వందమందికి పరీక్షలు చేశారు. వీరిలో 60 మందిని శస్త్ర చికిత్సల నిమిత్తం శంకర్ ఫౌండేషన్ ఆస్పత్రికి తరలించారు.

తీర ప్రాంతంలో గస్తీ ఏర్పాటు

ఇచ్ఛాపురం రూరల్: సముద్ర తీర ప్రాంతం గుండా వచ్చే చొరబాటుదారులను గుర్తించేందుకు మండలంలోని ముఖ్య కూడళ్లలో పోలీసులచే కోస్టల్ ఎక్సర్‌సైజ్ పేరిట గస్తీ ఏర్పాటు చేస్తున్నట్టు ఇచ్ఛాపురం రూరల్ పోలీసుస్టేషన్ ఎస్సై వి.రమేష్ చెప్పారు. మంగళవారం ఆయన ఇన్నేశుపేట, తిప్పనపుట్టుగ జంక్షన్ వద్ద గస్తీ నిర్వహిస్తున్న పోలీసులతో మాట్లాడారు. అపరిచిత వ్యక్తులు కనిపిస్తే వారిని విచారించాలని, స్థానిక ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. అనంతరం డొంకూరు సముద్ర తీరంలో పర్యటించారు.

అప్రమత్తంగా ఉండాలి

వజ్రపుకొత్తూరు రూరల్: సముద్ర మార్గంగా తీర ప్రాంత గ్రామాల్లోకి చొరబాటుదారులు అక్రమంగా ప్రవేశించే అవకాశం ఉన్న నేపథ్యంలో వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని కాశీబుగ్గ రూరల్ సీఐ జి.శంకర్‌రావు అన్నారు. అక్రమ చొరబాట్లను నిరోధించేందుకు రెండు రోజులు పాటు తీర ప్రాంత గ్రామాల్లో చేపడుతున్న 'సాగర్ కవచ్' కార్యక్రమంలో భాగంగా మంగళవారం అక్కుపల్లి, బెండి, బెండిగేట్, పూండి కూడల్లో పోలీసులు పహారా కాస్తూ పలు వాహనాలను తనిఖీ చేశారు. అక్కుపల్లిలో తనిఖీ కేంద్రాన్ని సీఐ పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. గ్రామాల్లో అపరిచిత వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని స్థానికులను కోరారు. స్థానిక ఎస్సై మధుసూదన్‌రావు ఉన్నారు.



సోంపేట: సిబ్బందితో మాట్లాడుతున్న సీఐ రమేష్

సోంపేటలో..

సోంపేట: తీరప్రాంత గస్తీపై సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని బారువ మెరైన్ సీఐ డి.వి.జె.రమేష్ అన్నారు. బారువ తీర ప్రాంతంలో బారువ, బారువ కొత్తూరు తీరంలో సాగర్ కవాచ్‌ను మంగళవారం నిర్వహించారు. తీర ప్రాంత గస్తీపై సిబ్బందికి సలహాలు, సూచనలు చేశారు. ఎస్సై జి.శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

తెలుగు తమ్ముళ్ల బాధ్యతా రాహిత్యం!



పడేసిన సూదులు, సిరంజులు



హానికర వస్తువులను తొలగిస్తున్న తులసీరామ్, గురుమూర్తి

ఇచ్ఛాపురం: సమాజం, ప్రజల పట్ల ఎటువంటి బాధ్యతలేదని ఇచ్ఛాపురం నియోజవర్గానికి చెందిన టీడీపీ నాయకులు నిరూపించుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. చంద్రబాబు అరెస్టును నిరసిస్తు ఇచ్ఛాపురం బస్టాండ్ కూడలిలో ఆ పార్టీ నాయకులు రిలే నిరాహార దీక్షలు ప్రారంభించి మొక్కుబడిగా మూడురోజుల్లోనే ముగించారు. దీక్షలకు ప్రజల నుంచి ఎటువంటి మద్దతు, స్పందన కనపడడంలేదు. దీంతో ప్రజలను ఆకర్షించేందుకు దీక్ష శిబిరం వద్ద మంగళవారం స్థానిక ఎమ్మెల్యే బి.అశోక్ ఆధ్వర్యంలో చంద్రబాబు కోసం రక్తం.. పేరుతో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. అయితే రక్తం సేకరణ కోసం ఉపయోగించే సూదులు, సిరంజులు, ఇతర సామగ్రిని శిబిరం వద్దనే పడేసి వెళ్లిపోయారు. టీడీపీ నేతలు బాధ్యతా రాహిత్యంగా వ్యవహరించి హానికర వస్తువులు అక్కడ పడవేయడంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు. ఈ క్రమంలో అక్కడికి వచ్చిన తులసీగాం, ముచ్చింద్ర గ్రామాలకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు ఇసురు తులసీరామ్, సాడి గురుమూర్తులు హానికర వస్తువులను తొలగించి.. ఆ ప్రాంతాన్ని శుభ్రం చేశారు. స్థానికులు వారికి కృతజ్ఞతలు తెలియజేశారు.

పిల్లలపై తల్లిదండ్రులు శ్రద్ధ చూపాలి

వజ్రపుకొత్తూరు రూరల్: విద్యార్థులు ఉన్నతి సాధించాలంటే వారిపై ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రులు కూడా ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలని నగరంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తెప్పల అప్పలస్వామి, పీఎంసీ అధ్యక్షుడు బాడ నాగభూషణ్ అన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులతో మంగళవారం సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రభుత్వ బడుల్లో జగనన్న గోరుముద్ద పథకం ద్వారా పౌష్టికాహారం, జగనన్న విద్యా కానుక కిట్లను అందిస్తున్నామన్నారు. నాడు-నేడు పథకం ద్వారా పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించడంతోపాటు నాణ్యమైన విద్యను అందిస్తున్నట్టు పేర్కొన్నారు. చిన్నారులను బడులకు పంపించి ప్రభుత్వ సాకారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యా ప్రమాణాలు మెరుగుపరిచేందుకు ప్రశాంతమైన వాతావరణంలో ఉత్తమైన బోధన అందిస్తున్నామన్నారు. పాఠశాల అభివృద్ధికి ప్రభుత్వ ప్రోత్సాహంతో పాటు దాతల సాకారం కావాలని కోరారు. పిల్లలను సెల్ ఫోన్, టీవీలకు దూరంగా ఉంచాలని, వారి ప్రవర్తనను గమనిస్తుండాలని సూచించారు. సమావేశంలో ఉపాధ్యాయులు కణితి సూర్యానారాయణ, కేశవరావు, యర్రన్న, సోమేశ్వరరావు, కె.ప్రసాద్ ఉన్నారు.



మాట్లాడుతున్న హెచ్‌ఎం అప్పలస్వామి

బాహుదా పాత వంతెన సామర్థ్యం పరిశీలన

ఇచ్ఛాపురం రూరల్: బ్రిటిష్ కాలంలో స్థానిక బాహుదా నదిపై నిర్మించిన వంతెన సామర్థ్యాన్ని విశాఖపట్నంకు చెందిన ఆంధ్రా యూనివర్సిటీ సివిల్ ఇంజినీరింగ్ ప్రొఫెసర్ డాక్టర్ కె.శ్రీనివాసరావు మంగళవారం పరిశీలించారు. 94 ఏళ్ల కిందట నిర్మించిన ఈ వంతెన ఈ ఏడాది మే నెలలో కొంత భాగం వంతెన కూలిపోయింది. దాని స్థానంలో కొత్త వంతెన నిర్మాణానికి ఇటీవల ప్రభుత్వం రూ.20 కోట్లు మంజూరు చేసినట్లు నియోజకవర్గ సమన్వయకర్త పిరియా సాయిరాజు వెల్లడించారు. ప్రస్తుతం ఇదే వంతెనపై నుంచి భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుండటంతో వంతెన మన్నిక, సామర్థ్యం తెలుసుకోవడానికి ప్రొఫెసర్ కె.శ్రీనివాసరావు నేతృత్వంలో వంతెన దిగువ భాగం, వంతెనపై భాగాలను పరిశీలించారు. వంతెనకు సంబంధించి ముడి సరుకులను తీసుకువెళ్లి ఆంధ్రా యూనివర్సిటీలో పరీక్షలు చేసిన అనంతరం వారం, పది రోజుల్లో వెల్లడిస్తామన్నారు. ఆయన వెంట రోడ్లు, భవనాల శాఖ డీఈఈ ఎస్.రామినాయుడు, జేఈ మోహన రావు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు ఉన్నారు.



బాహుదా వంతెన దిగువ భాగం పరిశీలిస్తున్న ప్రొఫెసర్ శ్రీనివాసరావు, డీఈఈ రామినాయుడు, జేఈ మోహన రావు

సంక్షిప్తంగా...

పంచాయతీ సిబ్బందితో సబ్ కలెక్టర్ చర్చలు

టెక్కలి: టెక్కలి మేజర్ పంచాయతీ సిబ్బందితో సబ్ కలెక్టర్ నూరుల్ కమార్ మంగళవారం రాత్రి తన కార్యాలయంలో చర్చించారు. బకాయి వేతనాల కోసం పంచాయతీలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులతో పాటు వివిధ విభాగాలకు చెందిన సిబ్బంది మూడు రోజులుగా సమ్మెకు దిగారు. దీంతో పట్టణంలో పారిశుద్ధ్య, మంచినీటి కుళాయిల నిర్వాహణ నిలిచిపోయింది. ఈ నేపథ్యంలో సబ్ కలెక్టర్ పంచాయతీ సిబ్బందిని పిలిపించి సమస్యలను తెలుసుకున్నారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా ముందుగా మంచినీటి సరఫరా చేయాలని సూచించారు. బుధవారం మరోసారి సిబ్బందితో చర్చించి సమస్యలను పరిష్కరిస్తామని సబ్ కలెక్టర్ నూరుల్ కమార్ భరోసా ఇచ్చారు.

దేశీయ పరిజ్ఞానంతో వ్యవసాయం మేలు

కోటబొమ్మాళి: దేశీయ పరిజ్ఞానంతో వ్యవసాయం చేయడం ద్వారా రైతులకు ఎంతో మేలు జరుగుతోందని పర్లాకిమిడి సెంచూరియన్ యునివర్సిటీకి చెందిన విద్యార్థులు అన్నారు. లఖందిడ్డి గ్రామంలో మంగళవారం పర్యటించి దేశీయ పరిజ్ఞానం ఆవశ్యకత, దానివల్ల జరిగే ప్రయోజనాలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో లఖందిడ్డి సచివాలయం అగ్రికల్చరర్ అసిస్టెంట్ ఎం.సాయికిరణ్, వర్సిటీ విద్యార్థులు అంపోలు వెంకటేష్, ఒడిసి నీత జీతుమ్మల, వినీత్ పాల్గొన్నారు.

250 మందికి అన్న, వస్త్రదానం

ఇచ్ఛాపురం: పట్టణానికి చెందిన వ్యాపారవేత్త ప్రత్తి రాజేష్ ఇటీవల మృతి చెందారు. దీంతో అతని జ్ఞాపకార్థం స్నేహితులు, షటిల్ బ్యాడ్మింటన్ క్రీడాకారులు కలిసి మంగళవారం 250 మందికి అన్న, వస్త్ర దానం చేశారు.

చిన్నారులకు దుస్తులు వితరణ

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని ప్రభుత్వ బాలసదనం చిన్నారులకు చినంచల గ్రామానికి చెందిన బొత్స మధుసూదన రావు, మీనాక్షి దంపతులు పెద్దమనసును చాటుకున్నారు. రూ.18 వేల విలువైన దుస్తులను వితరణగా మంగళవారం అందజేశారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరించాలి

సోంపేట: సబ్‌డివిజన్ పరిధిలోని పలు గ్రామాలకు లోఓల్టేజ్ విద్యుత్ సమస్య ఉందని వాటిని పరిష్కరించాలని వినియోగదారులు కోరారు. సోంపేట సబ్‌డివిజన్ కార్యాలయంలో మంగళవారం పలాస ఈఈ జి.ప్రసాద్ విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదికను నిర్వహించారు. లోవోల్టేజీ సమస్య ఉందని, ఆధార్ నంబర్లు ఎక్కువ సర్వీసులకు లింక్ అయ్యిందని పలువురు ఫిర్యాదు చేశారు. పరిష్కార వేదిక చైర్మన్ బి.సత్యన్నారాయణ మాట్లాడుతూ.. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో పరిష్కార వేదిక సభ్యులు ఎస్.హరిబాబు, వి.జనార్దనరావు, ఆర్.సురేంద్రకుమార్, డిప్యూటీ ఈఈ డి.శ్రీనివాస్, సోంపేట, కంచిలి, కవిటి, ఇచ్ఛాపురం ఏఈలు జి.రామారావు, ఎస్.గున్నయ్య, నేతాజీ, వి.గోవిందరావు పాల్గొన్నారు.

జీడిపంటకు గిట్టుబాటు ధర కల్పించాలి



మాట్లాడుతున్న శ్రీనివాసరావు

కాశీబుగ్గ: రాష్ట్ర ప్రభుత్వం జీడి బోర్డు ఏర్పాటు చేసి ఉద్దాన జీడి పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు కోరారు. జీడికి గిట్టుబాటు ధర కల్పించాలని, జీడి పంట సమగ్రాభివృద్ధి కోసం బోర్డు ఏర్పాటు చేయాలనే అంశంపై సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు అధ్యక్షతన మంగళవారం పలాసలో సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీడి రైతుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సూర్యనారాయణ, రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.